# స్త్రీ పాత్రలు లేని నాటిక

స్త్రీ పాత్రలు లేని నాటిక అని విన్నపుడల్లా నాకు చిర్రెత్తుకొస్తుంది. కొన్ని కొన్ని నాటికల్లో పదిమందిదాకా మగవేషాలున్నా ఒకే ఒక ఆడది బిక్కు బిక్కుమంటూ కనిపిస్తుంది. ఆ హీరోయిన్‌కి చుట్టు ప్రక్కల ఆడవాసన వుండదు. నాటకంలోని పురుషపాత్రలన్నీ ఆడదాని ప్రభావంనుంచి తప్పించుకుని తిరుగుతుంటాయి. అసలు ఆడది లేకుండా, లేక వుంటే ఒక ఆడదానితో బ్రహ్మాండమైన నాటకం కోసం డ్రామారావులు కలలు కంటూ వుంటారు. అలా మానవసమాజంలో సగానికి సగం పైగా ప్రాతినిధ్యం వహించే ఆడది లేకుండా నాటకం వ్రాసినవాడు మహారచయిత ఎలా అవుతాడు? క్రాక్ అవుతాడు కాని, ఏ కథానాయకుడ్నైనా తీర్చిదిద్దేది ఆడదే. అక్కో, వదినో, తల్లో, చెల్లెలో, పింతల్లో, ప్రియురాలో ఎందరో ఆడవాళ్ళు జీవితంలో ప్రవేశించి వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేయకపోతే మనిషి హీరో ఎలా అవుతాడు? ఇంత సింపుల్ ట్రూత్‌ని నాటకాలవాళ్ళు ఇగ్నోర్‌చేసి "ఆవుల్లీ బ్యాడ్" నాటకాల్ని ప్రదర్శిస్తూ వుంటారు. లైఫ్‌లో చాలా లేట్‌గా ప్రవేశించేది ప్రేయసే. ప్రేయసి పెళ్ళాం కావచ్చు కాకపోవచ్చు. ఒకటి అరా పావు ఆడదాన్తో సరిపుచ్చుకునే మనకు మహానాటకాలు, గొప్పకామెడీలు, గ్రేటు ట్రాజడీలు ఎక్కడ్నుంచి వస్తాయి? జీవితంలో ముఖ్యమైన ఒక భాగాన్ని సమాజంలోని అధిక సంఖ్యాకులైన స్త్రీ వర్గాన్ని స్త్రీ పాత్రలు లేని నాటికలద్వారా మినహాయిస్తే, ఆ మేరకు జీవితాన్ని నిర్లక్ష్యం చేసినట్లే కదా – అప్పుడది నాటకమెలా అవుతుంది. దొంగ నాటకమవుతుందికాని.

ఆడది లేకుండా పత్రికలలో కథలకు బొమ్మలు వెయ్యరు. ఆడపాత్రలకు ప్రాముఖ్యం లేకుండా కథలు, నవలలు ఎవరూ వ్రాయరు. ఆడవాళ్ళు చదవడానికి వీలులేకపోతే, ఆడవాళ్ళకు సరియైన ప్రాతినిధ్యం లేకపోతే, పత్రికలు ఆకర్షణను కోల్పోతాయి. మంచిగాని, చెడుగాని, కష్టంగాని, సుఖంగాని ఆడదానితో కలిసి అనుభవించడంలో వుంది పుణ్యం పురుషార్థమూనూ. స్త్రీ అర్థం వేరూ పురుషార్థం వేరూనా – ఈ మాటను డిక్షనరీలోంచి కొట్టేయండి.

స్త్రీ పాత్రలు లేని నాటికలు వ్రాసినవారు, ఒకటో అరో ఆడదాన్ని యిరికించి నాటకాలు వ్రాసిన పురుషులూ మహారచయితలైతే అలాంటి వారి దృష్టిలో కన్యాశుల్కం వ్రాసిన అప్పారావుగారు వట్టి తెలివితక్కువ వాడు. ఆయన కవి కాదు, రచయిత కాదు, ఆయనకు డ్రామా రాయడంలో ఓనమాలు తెలియవనీ, ఆయనకు బ్రాడ్వేనాటకాలు కాపీకొట్టడం చేతకాదనీ అసలు టెక్నిక్ తెలియదనీ ఆయనే తెలుగునాటకాన్ని పాడుచేశాడని షాక్ టెక్నిక్‌తో చవకబారు కబుర్లు చెప్పేవారిని పశువుల డాక్టరు దగ్గరికి ఇంజక్షన్లకు పంపాలి.

మావారు స్త్రీ పాత్రలులేని నాటికలో వేషం వేయడానికి వెళ్లేరు. నన్నూ రమ్మన్నారు. నాకు

వక్కుమండింది. నేన్రానన్నాను. చూడండి ఈ స్త్రీ పాత్రలులేని నాటికలు రాసేవాళ్ళకూ, స్త్రీలే అన్నం వండి నీళ్ళు తొలిపి వీపురుద్ది కంచం కడిగి తలకు కొబ్బరినూనె రాసి వారి ముద్దూ ముచ్చటా తీర్చాలి. ఇన్ని సేవలు చేయించుకున్న జాతి అంత నిర్మోహమాటంగా ఎలా ఉండగలుగుతుందో తల్చుకుంటే ఆశ్చర్యంగా వుంటుంది. అసలు స్త్రీ పాత్రలు లేకుండా నాటకాలు రాసేవాళ్ళను పశువులాసుపత్రిలోనూ, చూసేవాళ్ళను పిచ్చాసుపత్రిలోనూ చేర్పించాలి.

ఈ జగన్నాటకంలో స్త్రీ పురుషులు ముఖ్యపాత్రధారులైనపుడు స్త్రీకి పాత్రలేకుండా నాటకం సంభవమా? ఇది మగవాళ్ళ సంకుచితత్వానికి పరాకాష్ఠ – ప్రతీ నాటకంలో వో చచ్చిపోయిన ఆడదానికి పూలదండ వేసిన ఫొటో వుంటుంది. ఎవడో నౌఖరువెధవ దానికి బూజు దులిపి ఆడియన్సుకు అమ్మగారి సుగుణాలను ఏకరువుపెడుతూంటే చెడ్డ చిరాకేస్తుంది. ఇదీ ఆడదానికి మనం యిచ్చిన స్థానం అంటే వొళ్ళు గగుర్పొడుస్తుంది.

కన్యాశుల్కంలో బుచ్చమ్మ, వెంకమ్మ, మధురవాణి, మీనాక్షి, పూటకూళ్ళమ్మ ఆఖరికి స్టేజిమీదకు రాని సుబ్బిల్తో సహా వీరంతా లేకపోతే అప్పారావుగారు నాటకం ఎలా వ్రాయగల్రు – అందుకే ఆయన మంచిడ్రమెటిస్టు కాదంటున్నారు మన హాపీ యంగ్‌మన్స్ – ఈ కుళ్ళంతా కడిగి మంచినాటకాలు రావాలంటే ఆడాళ్ళు సీరియల్స్ రాయటం కొంచెం తగ్గించి బుర్రలకు పట్టిన బూజు దులిపి నాటకాలమీదకు దృష్టి మళ్ళించాల్సిందే. గరిటకాల్చి వాతపెట్టినట్లు నాటకాలు రాసి చూపించాలి.

నాటకాల్లోకూడా ఆడదాన్ని ఒకర్తినీ చేసి అస్తమానం పదహారేళ్ళ పాతికేళ్ళమధ్య వయస్సు అమ్మాయిని కథలో జొప్పించి దొంగ నాటకాల్ని వ్రాసే పద్ధతిని మార్చాలి.

ప్రేయసీ, పెళ్ళాడే అమ్మాయి, కులట, మోసగత్తెగా చిత్రించే రైటింగ్ హాబిట్‌ను స్త్రీలు కలగజేసుకుని రచనా పద్ధతిలో తిరుగుబాటు తేనిదే మన నాటక సాహిత్యానికీ మోక్షంలేదు. ఆడదాన్ని భోగవస్తువుగా చూపించే నాటకాన్ని పదేపదే చూసి విసుగెత్తిపోయిన మనకళ్ళకు కొత్త కథలు రావాలంటే అణగారిపోయిన వర్గంలోంచే రావాలి.

స్త్రీ సమస్యల్ను కళ్ళకు కట్టినట్లు చిత్రించాలంటే నాటకం గొప్ప సాధనం కదా – మన రైటరీమణులు కలం పట్టి విజృంభించకపోతే ఈ స్తబ్ధత ఈ కుళ్ళు ఈ మిస్ రిప్రజంటేషను అలానే ఉండిపోతుంది. అంచేత స్త్రీ పాత్రలు లేని నాటికల్ను చూడకండి. ప్రహ్లాదుడు హిరణ్యకశిపుడ్ని పెట్టిన బాధలన్నీ పెడితేనేగాని నరసింహమూర్తి బయటకు రాలేదుకదా – ఇప్పుడు నరసింహావతారం రావాలంటే మనమంతా ప్రహ్లాదమ్మలైపోవాలి. బాధలు కన్నీళ్ళు హింస దుర్మార్గం సహించడం మనకలవాటైపోయిందిగా – ఆ ఏడుపేదో నవలలతోబాటు నాటకంద్వారా కూడా సాగిస్తే బాగుంటుందని నా అయిడియా –